


రాత్రి తొమ్మిది గంటలయింది.

సారధి అప్పుడే భోంచేసి, నోట్లో రెండు వక్క పలుకలు వేసుకుని గబగబా బట్టలేసుకుంటున్నాడు.

శారద మంచంలో నీరసంగా కదిలి, "మళ్ళీ ఎక్కడికండీ ?" అని మెల్లగా అడిగింది.

ఆమె వంక చూడకుండానే తను వాచీ పెట్టుకుంటూ పొడిగా, "ఆఫీసుకు" అన్నాడు.

"రాత్రుళ్ళు కూడా ఆఫీసు పనేనా ? వారంరోజుల్నుంచి రోజూ రాత్రుళ్ళు వెళ్ళుతున్నారుగా...."

ఆమె మాట పూర్తికాకుండానే మధ్యలో తను విసుక్కున్నాడు. "ఇవ్వాళ్ళేకాదు ఇంకా నెలరోజులు ఈ పని వుంటుంది. రోజూ వెళ్ళాల్సిందే !"

పాపం శారద మళ్ళీ మాట్లాడలేదు. తన వంక చూస్తూ, ప్రక్కలో వున్న పసిపిల్లాడిమీద చెయ్యి వేసుకుని అలాగే పండుకొని వుంది.

తనకు జాలేసింది. గొంతును కాస్త మృదువుగా మార్చుకొని, "కాదు శారదా! మా ఆఫీసులో స్పెషల్‌వర్క్ ఒకటి వచ్చింది. అది చేస్తే రెండువేలుదాకా

వస్తుంది. వాటితో నీకు ముత్యాలగొలుసు చేయిద్దామని నేను చూస్తూంటే....” అన్నాడు.

“చేయించినప్పుడు చూద్దాంలెండి....” చిక్కిపోయిన చెక్కిళ్ళమీదకు పల్చటి నవ్వు ప్రాకింది.

చేతిలో పొడరేసుకొని చెంపలకూ, మెడకూ అద్దుకుంటూంటే శారద తన వంకే గోముగా చూస్తూండటం తను గ్రహింపకపోలేదు.

“కాసేపు నా దగ్గర కూర్చోండి — ఏవయినా కబుర్లు చెప్పండి....” ఆ గొంతులో ప్రేమా, దిగులూ, జాలి అర్థింపూ తనకు తెలుస్తూనే వున్నా తను వాటిని పట్టించుకునే స్థితిలో లేడు. భార్య మంచంవైపుకు తిరిగేడు.

మంచాని కతుక్కుపోయి వుంది. పీక్కుపోయిన చెంపలూ, లోతుకు పోయిన కళ్ళూ, ఎముకల ప్రోగులాగా వుంది. పైగా వెధవ పురిటి కంపొకటి.

తనకు కడుపులో దేవినట్లయింది. పైగా ప్రక్కన కూర్చొని కబుర్లు చెప్పటమా ?

“లేదు శారదా, టైం అయిపోయింది —” అంటూ, ఆమె మారు మాట్లాడటానికి సందు ఇవ్వకుండా గది లోంచి బయటకొచ్చేశాడు.

చెప్పులు తొడుక్కుంటూ వుంటే తల్లి పట్టుకుంది. “ఏరా, ఈ రోజు కూడా ఆఫీసు పనేనా ? నీ దారిన నీవు ఆఫీసుపనంటూ రాత్రుళ్ళు యింట్లో వుండకుండా పోతే బిక్కు బిక్కుమంటూ ఆడపీనుగులం యిద్దరమే ఎలా వుంటాంరా ? పైగా నీ పెద్దకొడుకు రాత్రుళ్ళు లేచి ‘నాన్నా నాన్నా’ అని ఏడుస్తూ కూర్చుంటాడు....”

ఆమె మాట్లాడుతూనే వుంది తను వీధిలోకి వచ్చేశాడు.

సెంటర్లో రాములు కిళ్ళీషాపులో స్పెషల్ కిళ్ళీ కట్టించుకున్నాడు. ఘుమ ఘుమలాడే కిళ్ళీ నములుతూ ఫిల్టర్ సిగిరెట్టు వెలిగించి బస్సుస్టాండ్ వయిపు నడిచేడు.

బస్సుస్టాండ్ ప్రక్కనే వున్న మూడంతస్థుల ఆర్టీసీ ఆఫీసులోనే తను పనిచేసేది. లైట్లన్నీ ఆర్పేసిన ఆ ఆఫీసు నిద్రజోగుతున్న బ్రహ్మరాక్షసి లాగా వుంది.

తనలో తాను చిన్నగా నవ్వుకున్నాడు.

అవుట్ గేటు దగ్గర రిక్షా పట్టుకొని నిలబడ్డ రిక్షా సత్యం తనని చూసి పలకరింపుగా చిన్నగా నవ్వేడు. “ఇంత ఆలిసెం అయిందేం సార్ ? మీకోసరం గంట సేపట్నించీ సూత్తోన్నా.” అన్నాడు.

తను మాట్లాడకుండా రిక్షా ఎక్కి కూర్చున్నాడు. రిక్షా ముందుకు సాగింది...

ఈ రిక్షా సత్యంతో తనకు గమ్మత్తుగా పరిచయం ఏర్పడింది. ఆ రోజు రాత్రి తను లక్ష్మిటాకీస్ ముందు నిలబడి సిగరెట్టు

త్రాగుతున్నాడు. అప్పుడే ఫస్ట్ షో వదిలారు. బయటికొస్తున్న రకరకాల ఆడవాళ్ళను చూస్తున్నాడు తను.

వీడు రిక్షా ప్రక్కకు తీసికొచ్చి, "ఏం సార్ వెళ్ళదామా?" అన్నాడు చిన్నగా నవ్వుతూ....

ఈ రిక్షావాళ్ళు మనుషుల్ని ఎలా పసిగడతారో కదా!

అలాగే, ఇస్త్రీ బట్టలేసుకొని నీటుగా వుండే రిక్షావాళ్ళు ఏం చేస్తుంటారో తన లాటివాళ్ళకూ తెలుసూ.

"ఎక్కడ?" అని తను అడిగేడు. "మీరెక్కండి సార్!" అన్నాడు. తను రిక్షా ఎక్కేడు, ఎలాటి జంకూ లేకుండా. వీడ్ని చాలా రోజులుగా ఈ సెంటర్లోనే చూస్తోన్నాడు తను. ఏవయినా వెర్రి వేషాలేస్తే మళ్ళీ రేపు దొరకడూ?

ఆ రాత్రి వాడు తీసికెళ్ళిన చోట మర్యాదగా, చాలా గుట్టుగా సుఖాన్ని కొనుక్కున్నాడు.

మళ్ళీ మర్నాడు తను ఆ సెంటర్ కెళ్ళాడు. తనని చూసి స్నేహపూర్వకంగా నవ్వి, "ఇవ్వాళ్ళ క్రొత్త చోటు కెళ్ళదాం రాండి!" అన్నాడు.

దార్లో ఏం సార్, "అదోళ్ళు వూళ్లో లేరా?" అని అడిగేడు చనువుగా.


తను, "వున్నారోయ్ - కాని పురుడు పోసుకున్నారు" అన్నాడు.

"అట్టా సెప్పండి! లేకపోతే తమరులాంటోళ్ళు ఇట్టా రారు! నా కెరికే!"

శారద మొదటిసారి వాళ్ళ పుట్టింట్లోనే పురుడు పోసుకుంది. అప్పుడు తను ఇలాటి వెర్రివేషాలు వెయ్యలేదు. పెళ్ళయిన క్రొత్త కాబట్టి, తన శారద యిచ్చిన మధురానుభవాలను తల్చుకుంటూ, ఆమె సుందర రూపాన్ని మనస్సులో మలచుకుంటూ విరహం వొలకబోస్తూ ప్రేమలేఖలు రాసేవాడు. రాత్రుళ్ళు సెక్సు పుస్తకాలు తెచ్చుకొని చదువుకుంటూ, సిన్మాలు చూస్తూ కాలక్షేపం చేసేవాడు.

రెండో కాన్పుకు పుట్టింటి కెళ్ళకూడదని ఇక్కడే వుండిపోయింది. తొమ్మిదో నెల వచ్చేవరకు రాత్రుళ్ళు శారదను యిబ్బంది పెట్టుతుండేవాడు. ప్రసవించటం చాల కష్టమయ్యేసరికి అమెరికన్ ఆసుపత్రిలో జాయిన్ చేశాడు. వాళ్ళు పెద్ద ఆపరేషన్ చేశారు. మళ్ళీ మరో జన్మ ఎత్తినట్లే! ఆర్నెల్లవరకు మంచం దిగకూడదు. చాల జాగ్రత్తగా వుండాలన్నారు. డిశ్చార్జ్ చేసే రోజున లేడీ డాక్టరు తనని ప్రక్కకు పిలిచి, "మీరీ ఆర్నెల్లూ ఆమె జోలికి పోకూడదు!" అని గట్టిగా హెచ్చరించి ముసిముసిగా నవ్వింది. ఉత్తరం రాసి తోడుకు తన తల్లిని పిలిపించాడు.

శారద చాల నీరసించిపోయింది. రక్తం చాలా పోయింది. వొళ్ళంతా కండతో మిసమిస లాడుతుండే శారద ఎముకల గూడయిపోయింది. చాల




వికారంగా తయారయింది. చూస్తోంటే దోకు వచ్చేటట్లుంది.

ఆర్నెల్లు స్త్రీ సంపర్కం లేకుండా ఎలా గటపటం? ఎలా నిగ్రహించుకోవాలి? ఈ కోర్కెలను ఎలా అదుపులో పెట్టుకోవాలి? వెధవ సెంటిమెంట్స్ కోసం మాంచి యౌవ్వనాన్ని ఆర్నెల్లు ఎండకట్టాలా? షిర్ నాన్సెన్స్!!.... ఇలా అనుకొంటూ ఆఫీసుల్లోనూ, బస్సుల్లోనూ, సిన్మాహాలు గేట్ల దగ్గర 'ఆకలి చూపులు' చూస్తూండగా ఈ రిక్షాసత్యం గాడు తనని పసిగట్టేడు.

వరసగా వారంరోజులు రాత్రుళ్ళు ఇక్కడా అక్కడా త్రిప్పేసరికి వాడికే విసుగుపుట్టినట్లుంది; ఒక రోజు, "ఈ చిలక్కొట్టుళ్ళు ఎందుకు సార్? ఒక మాంచి పిల్లవుంది. కాలేజీలో కూడ చదివింది. నెలకింతని యిచ్చి కీప్ చేసేయండి." అన్నాడు.

"పర్మనెంట్‌గా నాకెందుకోయ్?"

"టెంపరవారీగానే పెట్టుకోండి సార్, నెలంటె నెలా, మూణ్ణెళ్ళంటే మూణ్ణెళ్ళూ మీ యిష్టం? అసలు మీరొక్కసారి ఆ పిల్లను చూస్తే మీరే వదల్నంటారు" అన్నాడు. తను సరే అన్నాడు.

నిజంగానే రజనీని చూశాక తనకు

వదలబుద్ధి కాలేదు. వాళ్ళకక్కా పెట్టిన షరతులకన్నీ వొప్పుకున్నాడు....

నెలకి 'ఇంత' అంటే, 'అంత'తోనే ఆగిపోలేదు. సిన్మాలకనీ, చీరెలకనీ, స్నో పౌడర్లకనీ, తన దగ్గర బాగానే గుంజారు. ఆ పిల్ల దగ్గర్నుంచి తను పొందుతున్నదానికి ఏమిచ్చినా ఫర్వాలే దనిపించింది సారధికి.

ఆ దెబ్బతో అంతకు ముందున్న బ్యాంక్ బేలన్సూ అయిపోయింది; తల్లి తీసికొచ్చిన పంట డబ్బూ అయి పోయింది. పైగా నోట్లురాసి వడ్డీలకు అప్పులు తీసికోవల్సి వచ్చింది. ఆ అప్పులు తీర్చటానికి భార్యకు తను ఆశపెట్టిన ముత్యాల గొలుసు చేయించక పోగా ఆమె పెద్దగొలుసు తాకట్టుక్రింద కెళ్ళింది. అయినా సారథి బాధపడలేదు. ఆ రజనీ యిచ్చిన అనుభవాన్ని గుండెల్లో పదిలంగా దాచుకున్నాడు.

ఆ తర్వాత శారద చాలసార్లు, "మీ స్పెషల్‌వర్క్ డబ్బులు ఇంకా రాలే దేమండీ?" అని అడిగేది.

"వస్తాయి స్పెషల్‌వర్క్ చెయ్యగానే చేతిలో పోస్తారనుకుంటున్నావా?" అని చిరాకుపడేవాడు.

* * *

....ఇది జరిగి దాదాపు రెండు సంవత్సరాలయింది.

గతం గుర్తుకొచ్చి సారధి చిన్నగా నవ్వుకున్నాడు. ఇప్పుడా రజనీ ఎక్కడుందో? మదరాసుకెళ్ళి సిన్మాలలో జేరిందని ఆ మధ్య ఎవరో అన్నారు. నిజానికి సిన్మాస్టార్ కావల్సిన హొయలున్నాయి రజనీకి.

—సారధి ప్రక్కకు వత్తిగిల్లేసరికి తుంటి బాధనిపించింది.

పదిరోజుల క్రితం సారధికి స్కూటర్ ఏక్సిడెంట్ అయింది. కుడికాలు తుంటెముకా, ఎడంచెయ్యి ఎముకా విరిగేయి. ఆర్నెల్లవరకు మంచంలోంచి కదలటానికి వీల్లేదన్నారు.

ఇంతలో శారద భోజనం కేరియర్ తీసికొని హడావుడిగా వచ్చి, "పాడు సిటీబస్సు లేటయిపోయింది. మీకు ఆకలేస్తుందా?" నొచ్చుకుంటూ అడిగింది.

తను మాట్లాడలేదు. ఆమె వంక చూస్తూండిపోయాడు. శారద ఎంత ఆరోగ్యంగా, అందంగా, మిసమిసలాడుతూంది। ఇద్దరు పిల్లలతల్లి అంటే ఎవరూ నమ్మరు; అంత అందంగా, లేతగా వుందనుకున్నాడు మనస్సులో.

పాపం, శారద, ఈ ఆర్నెల్లూ తన కోసం ఎంత కష్టపడాలి? ఈ ఆర్నెల్లూ ఆమెకు తనేం సుఖాన్ని ఇవ్వగలడు? ఆమె ఎలా కంట్రోల్ చేసుకుంటుంది.... ఇకాపైన ఆలోచించాలంటే సారధికి భయమేసింది।

———